క్లుప్తంగా

ఎమ్మెల్యేకు గిరిజన నాయకుల సన్మానం



వెల్దండ: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన గిరిజన నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేయాలని వివరించారు. తండాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివరామ్‌నాయక్, దుబ్బతండా శ్రీనునాయక్, ఆయా తండాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



కల్వకుర్తి: క్రీడలు ఆడటంతో మనిషిలో కొత్త శక్తిని నింపటంతో పాటుగా, కొత్తపుంతలు తొక్కడానికి తోడ్పాటును అందిస్తాయని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. ఆదివారం పట్టణంలోని వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. సాంప్రదాయ క్రీడల కంటే, ఆధునిక ప్రపంచ గుర్తింపు కలిగిన క్రీడల్లో ప్రావీణ్యం సాధిస్తే వ్యక్తిగత గుర్తింపు సాధించవచ్చని పేర్కొన్నారు. క్రమశిక్షణతో సాధన చేస్తే ఆటల్లో ప్రావీణ్యం సాధించవచ్చని ఎస్‌బీఐ జోగుళాంబ గద్వాల రీజియన్ చీఫ్‌మేనేజర్ అమర్‌బాలు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడలతో పాటుగా క్రీడాకారులకు మావంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ విజయ్, ఎస్‌బీఐ మేనేజర్లు జితేందర్, శ్రీధర్, షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు శశాంక్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతుకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



కల్వకుర్తి రూరల్: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తాండ్రలో రైతులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ నిధులను త్వరలోనే విడుదల చేస్తారని చెప్పారు. అనేక ఇబ్బందులు పడుతున్నా.. వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్తున్న రైతులు అభినందనీయులని అన్నారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి పొలాల వెంట తిరిగిన అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

తాడూరు: ఎన్నికల సమయంలో ప్రభుత్వం దళితులు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు మార్పు కోరుకుని ఎన్నో ఆశలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. యాసంగి సీజన్‌లో రైతు సాయం డబ్బులు రైతులకు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతుబంధు ఎకరాకు రూ.15 వేలు ఇంత వరకు రైతు ఖాతాల్లో జమ కాలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, మశన్న, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

ముళ్లచెట్లతో అవస్థలు

బల్మూర్: మండలంలోని బల్మూర్– గోదల్, తుమ్మెన్‌పేట, చెన్నారం – పోలిశెట్టిపల్లి రూట్లలో బీటీ రోడ్లకు ఇరువైపుల ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి కమ్మేయడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్లపై రాత్రివేళ ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇవ్వడానికి కిందికి దిగే పరిస్థితి లేకపోవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపుల ప్రమాదభరితంగా పెరిగిన ముళ్ల చెట్లను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.



ఈకేవైసీ ఇక్కట్లు

- గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు
- ముందస్తు ఏర్పాట్లు చేయని నిర్వాహకులు
- గ్రామాలకు వచ్చి కేవైసీ చేయాలని కోరుతున్న లబ్ధిదారులు



అచ్చంపేటలో బారులు తీరిన మహిళలు

అచ్చంపేట రూరల్: గ్యాస్ రాయితీ పథకం అమలు విధివిధానాలపై పట్టణ, పల్లెవాసుల్లో గందరగోళం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిబంధనలు పెట్టకపోయినా తప్పుడు ప్రచారాన్ని నమ్ముతున్న లబ్ధిదారులు ఏజెన్సీల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈకేవైసీ పూర్తిచేయాలని గడువు విధించిందనే ప్రచారంతో ఏజెన్సీల ముందు జనం బారులు తీరుతున్నారు. మరికొందరు తమ ఖాతాలను మహిళల పేరున మార్చాలని కోరుతున్నారు. వివరాలు అప్డేట్ చేయడానికి ఇంకా సమయం ఉందని చెప్పినా వినే పరిస్థితి లేదని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అంటున్నారు. సర్వర్ సమస్యలు తలెత్తుతున్న తరుణంలో వీరందరి వివరాలు నమోదు చేయడం సవాల్‌గా మారింది.

దూర ప్రాంతాల నుంచి..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే సరఫరా చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అనుకున్నట్లే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, వచ్చే నెల నుంచి సిలిండర్‌ను రూ.500 కే ఇస్తున్నారని తప్పుడు ప్రచారం జరగడంతో గ్యాస్ ఏజెన్సీల వద్ద మహిళలు బారులు తీరుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు బారులు తీరుతున్నారు. ఈకేవైసీ చేసుకుంటేనే గ్యాస్ సిలిండర్‌ను ఇస్తారని, లేకుంటే ఎలాంటి పథకాలు వర్తించవని కొందరు చెప్పడంతో ఒక్కసారిగా ఎగబడుతూ ఇబ్బందులు పడుతున్నారు.

సౌకర్యాలు కల్పించని ఏజెన్సీ నిర్వాహకులు..

ఈకేవైసీ చేసుకోవడానికి కార్యాలయం వద్దకు వచ్చిన మహిళలు, వినియోగదారులకు ఏజెన్సీ నిర్వాహకులు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. 15 రోజులకు పైబడి ఈ తతంగం నడుస్తున్నా ఏజెన్సీ నిర్వాహకులు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. మధ్యాహ్నం పస్తులు ఉండి సాయంత్రం దాకా ఎదురుచూసి ఈకేవైసీ చేయించుకుని వెళ్తున్నారు. పట్టణ, మండల కేంద్రాల్లో ఉండే ఏజెన్సీ కార్యాలయాల వద్దకు రావడానికి వ్యయ, దూర భారం పెరుగుతుందని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.



లింగాల మండలంలో ఏజెన్సీ నిర్వాహకుడితో మాట్లాడుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

యాప్‌ల ద్వారా వెసులుబాటున్నా...

వినియోగదారులు సొంతంగానే ఈ కేవైసీ అప్‌డేట్ చేసుకునే వెసులుబాటు ఉన్నా.. వారికి సాంకేతిక సమస్యలు తప్పడం లేదు. ప్లే స్టోర్‌లో హిందుస్థాన్ పెట్రోలియం, భారత్, ఇండియన్ తదితర చమురు సంస్థల ఆండ్రాయిడ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకున్న కొందరు అప్‌డేట్ సమయంలో ఎర్రర్ వస్తోందని ఫిర్యాదు చేస్తున్నారు. సంస్థల అధికారిక వెబ్‌సైట్‌లోనూ ఇవే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని మరికొందరు పోస్టు చేస్తున్నారు. అలాగే మహిళల పేరు మీద ఉన్న ఖాతాలకే గ్యాస్ రాయితీ పథకం వర్తిస్తుందంటూ ప్రచారం సాగుతుండటంతో అనేక మంది తమ కనెక్షన్లను మహిళల పేరు మీదకు మార్చుతున్నారు.

అప్‌డేట్ ఎలా చేసుకోవాలి..

ముందుగా https://www.mypf.in వెబ్‌సైట్‌లోకి వెళ్తే మూడు గ్యాస్ కంపెనీలకు సంబంధించిన వివరాలు కన్పిస్తాయి. ఏ కనెక్షన్ వాడుతున్నారో ఆ సంస్థ సిలిండర్ గుర్తును ఎంపిక చేయాలి. కేవైసీ అప్‌డేట్ అయిందా లేదా ముందు పరిశీలించుకోవాలి. ఇందుకోసం సైనప్ ద్వారా వివరాలు నింపి రిజిస్టర్ అవ్వాలి. ఓటీపీ, పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అయ్యి 'వ్యూ డిటెయిల్స్'ను ఎంపిక చేస్తే ఖాతాదారు పూర్తి వివరాలు కనిపిస్తాయి. అందులో కేవైసీ అప్ డేట్ చేశారా? లేదా? అనే విషయం స్పష్టమవుతుంది. కేవైసీ అప్డేట్ లేకపోతే లాగిన్ అయ్యాక 'సీడ్ కేవైసీ' ఎంపిక చేసుకోవాలి. తర్వాత కనిపించే దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేసి ఏజెన్సీలో ఇస్తే బయో మెట్రిక్ ద్వారా ప్రక్రియను పూర్తి చేస్తారు.

గ్రామాలకు వచ్చి కేవైసీ చేయాలి...



ప్రతి వారం గ్రామాలకు వచ్చి సిలిండర్‌ను అందిస్తున్నట్లుగానే గ్రామంలోనే ఈ కేవైసీ చేయాలి. సిలిండర్‌పై రూ.20 నుంచి రూ.50ల వరకు అధికంగానే చెలిస్తున్నాం. దూర, వ్యయభారం భరించి అచ్చంపేటకు వచ్చి కేవైసీ చేయించుకున్నాం. అధికారులు స్పందించి గ్రామాల్లోనే కేవైసీ చేసేలా చూడాలి.

– చంద్రకళ, చౌటపల్లి, అచ్చంపేట మండలం

ఈ– కేవైసీకి సమయం ఉంది...

వినియోగదారులందరూ ఆధార్‌కార్డు, గ్యాస్ నంబర్‌తో ఈ కేవైసీ చేసుకోవాలని ఇటీవలే ఆదేశాలు వచ్చాయి. అన్ని గ్రామాల్లో వినియోగదారులకు సమాచారం ఇచ్చాం. కార్యాలయానికి వచ్చిన వినియోగదారులందరికీ ఈకేవైసీ చేశాం. ఈ కేవైసీకి ఇంకా సమయం ఉంది. తప్పుడు సమాచారం ఎవ్వరూ నమ్మవద్దు.

– గోపాల్‌యాదవ్, లక్ష్మీప్రసన్న గ్యాస్ ఏజెన్సీ మేనేజర్, అచ్చంపేట

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి కల్యాణం

పెంట్లవెల్లి: మండలంలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం లక్ష్మీనారాయణస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా కొనసాగింది. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో ఆలయంలో పాల్గొన్నారు. ఉదయం 6 గంటలకు కలశపూజ, గణపతిపూజ, అభిషేకం, సహస్ర నామార్చన వంటి కార్యక్రమాలు, 11 గంటలకు కల్యాణ మహోత్సవం, ఒంటి గంటకు అన్నప్రసాదాల వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు కొప్పుల బాల్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

సీఎంను కలిసిన ఆలయ అర్చకులు



సీఎంను కలిసిన దేవాలయ అర్చకులు

చారకొండ: సీఎం రేవంత్ రెడ్డిని మండలంలోని సిర్సనగండ్ల సీతారమచంద్రస్వామి దేవాలయ చైర్మన్ రామశర్మ, ఆలయ అర్చకులు ఆదివారం హైదరాబాద్‌లో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి కృషి చేయలన్నారు. సీఎం సానుకూలంగా స్పందిస్తూ.. దేవాలయాన్ని సందర్శిస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఆలయ ఆధ్వర్యంలో సీతారామచంద్ర స్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు లక్ష్మణ్ శర్మ, మురళీధర్ శర్మ, వేణు శర్మ, రఘు శర్మ, ప్రవీణ్ శర్మ తదితరులు ఉన్నారు.

సీఎంని కలిసిన కృష్ణారెడ్డి

వంగూరు: మండలంలోని కొండారెడ్డిపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మీ రాకకోసం కొండారెడ్డిపల్లి గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారని త్వరలో మీరు పుట్టిన స్వగ్రామానికి రావాలని కోరినట్లు కృష్ణారెడ్డి తెలిపారు. ఎప్పుడు వచ్చే విషయాన్ని త్వరలోనే ప్రకటిస్తానని సీఎం చెప్పినట్లు కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఈ ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మైసమ్మ దేవతను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. క్రిస్మస్ సెలవులు ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి గ్రామాలకు చేరుకున్న ప్రజలు సొంత వాహనాలు ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దూర ప్రాంతాలైన వనపర్తి, గద్వాల, పెబ్బేరు, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాల నుంచి భక్తులు ఉదయం నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. 10వేల మంది భక్తులు హాజరై మైసమ్మ దేవతను దర్శించుకున్నట్లు ఎండోమెంట్ అధికారులు రంగారావు తెలియజేశారు.



మైసమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

బాక్సింగ్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

కొల్లాపూర్: మండలం మొలచింతలపల్లికి చెందిన పల్లవి 44–46 కిలోల విభాగంలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు బాక్సింగ్ కోచ్ భాస్కర్ వెల్లడించారు. శనివారం సికింద్రాబాద్‌లోని ఆర్‌ఆర్‌సీ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పల్లవి సిల్వర్ మెడల్ సాధించిందని తెలియజేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శ్రీలేఖ 46–48 కిలోల విభాగంలో, 50–52 కిలోల విభాగంలో సరస్వతి గోల్డ్ మెడల్ సాధించారన్నారు. 48–50 కిలోల విభాగంలో మంజుల సిల్వర్ మెడల్ సాధించారన్నారు. శ్రీలేఖ, సరస్వతి, మంజుల మానవపాడు రెసిడెన్షియల్ స్కూల్‌లో చదువుతున్నారని చెప్పారు.



బాక్సింగ్ పోటీల్లో విజేతలతో కోచ్‌లు

కడుపులో కణితి తొలగింపు

అచ్చంపేట రూరల్: మండలంలోని హాజీపూర్‌కు చెందిన 40 సంవత్సరాల బుద్దుల బాలీశ్వరమ్మ ఆరు నెలల నుంచి కడుపు నొప్పితో బాధపడుతుంది. పట్టణంలోని సురక్ష పీపుల్స్ హాస్పిటల్ వైద్యుడు సీ.ఏ చైతన్యను సంప్రదించింది. అన్ని పరీక్షలు చేయగా.. కడుపులో కణితి ఉందని తేలింది. దీంతో ఆదివారం శస్త్రచికిత్స చేసి కడుపులోని 5.5 కిలోల కణితిని తొలగించారు. ప్రత్యేక శస్త్రచికిత్స నిపుణులు చైతన్య, ప్రతాప్‌వర్మ, వెంకట్‌రెడ్డి రెండు గంటల పాటు శస్త్ర చికిత్స చేసి తొలగించారు.

ఆర్థిక సాయం అందజేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌లో కొద్ది రోజుల కిందట మొగులాల్ అనారోగ్యానికి గురై మృతిచెందాడు. ఆదివారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మొగులాల్ కుమారుడు ఆదిత్యకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సురేష్‌గౌడ్, దేవయ్య, చంద్రయ్య, వెంకటరత్నం, నర్సింహ, కృష్ణయ్య, పరశురాముడు, రమేష్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన నవాజ్ (25) రోడ్డ ప్రమాదంలో ఇటీవల మృతిచెందాడు. ఆదివారం మృతుడి కుటుంబాన్ని మున్సిపల్ చైర్మన్ సత్యం, కౌన్సిలర్లతో కలిసి వారి కుటుంబ సభ్యులకు రూ.35 వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు శ్రీశైలం, సైదాబాబు, భోజిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

క్లాస్‌మేట్ క్లబ్ విజన్ కమిటీ ఎన్నిక

కందనూలు: జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడిగా చిగుళ్లపల్లి రమణ కుమార్, ఉపాధ్యక్షుడిగా డీవీ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎండీ కాజా, కోశాధికారిగా రవికిరణ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపకుడు వాస రాఘవేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు కందూరి లక్ష్మణస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు ఎంపీడీఓ ఎస్. రామ్మోహన్, ఎన్.చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మణస్వామి, పాండు తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు సరికావు

ఊర్కొండ: మండల పరిధిలోని పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయం నిధులు కానీ దేవాదాయ శాఖ భూములు కానీ ఎలాంటి అక్రమాలకు గురికాలేదని ఊర్కొండపేట మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్ అన్నారు. ఊర్కొండ పేట ఆంజనేయ స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం అయ్యాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించడం సరికాదని, ఆలయ భూములు లెక్కలు సరిగా ఉన్నాయన్నారు. ఆలయానికి సంబంధించిన ప్రతి రూపాయి లెక్కల్లో ఉందని సాక్ష్యాలతో సహా సరిగ్గా ఉన్నాయన్నారు. మీకు సందేహాలు ఉంటే విచారణ జరిపించి మీ చిత్తశుద్ధి నిరూపించుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ నాయకులు మీద ఉందని ఊర్కొండ పేట మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్ అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిజానిజాలు తెలుసుకోకుండా ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు క్షమించరన్నారు. సమావేశంలో రాజేష్ చారి, ఆంజనేయులు, బాలు గౌడ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబు



పట్టణంలోని ఎంబీ చర్చిలో ఏసు జననంపై చిన్నారుల నాటిక

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో చర్చిలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. పండుగ ప్రత్యేకతను వివరించే సందేశాలతో పాటుగా, సంగీత నృత్యాలు, ఇతర కార్యక్రమాలు ఉంటాయని కల్వకుర్తి ఎంబీ చర్చి నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి మహబూబ్‌నగర్ రోడ్డులోని ఎంబీ చర్చిలో సెమీక్రిస్మస్ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ సత్యం పాల్గొని, క్రైస్తవ సోదరులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతిఒక్కరూ పొరుగు వారిపై ప్రేమ, ఆప్యాయతలు వెల్లివిరిసేలా కనబరచాలన్నారు. ఏసుక్రీస్తు చూపిన మార్గం ద్వారా సమాజంలో శాంతి, సహనం అనేది చాలా మంది అలవర్చుకున్నారని అన్నారు. అనంతరం చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఏసు జననం గురించిన నాటిక పలువురి ఆకట్టుకున్నాయి. ఎంబీ చర్చి అధ్యక్షురాలు జోహర్ణ, వైస్ ప్రసిడెంట్ స్టీఫెన్ సన్, సాయి ప్రసాద్, రవి, రాజు, రామస్వామి, జగదీష్, ప్రేమ్, కృష్ణమూర్తి, ఇబ్రాయిల్ పాల్గొన్నారు.



తెలకపల్లిలో ముస్తాబైన బెతెస్తా చర్చి

తెలకపల్లి: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మూడు రోజుల నుంచి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో చర్చిలు ముస్తాబవుతున్నాయి. క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొనేందుకు క్రైస్తవులు గ్రామాల్లో చర్చిలను ముస్తాబు చేశారు. మండల కేంద్రంలోని సీజీఎం చర్చితో పాటు బెతెస్తా చర్చి, నాగర్‌కర్నూల్ రోడ్డులోని పెట్రోల్‌బంకు ఎదురుగా ఉన్న చర్చి, తాళ్లపల్లి, వట్టిపల్లి, గడ్డంపల్లి, గౌతంపల్లి తదితర గ్రామాల్లో ఉన్న చర్చిలను క్రైస్తవ సోదరులు ముస్తాబు చేశారు. సోమవారం క్రిస్మస్ నిర్వహించుకోనున్నట్లు చెప్పారు.

పెన్సిల్‌పై క్రిస్మస్ ట్రీ

కల్వకుర్తి రూరల్: క్రైస్తవులకు ముఖ్యమైన క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కల్వకుర్తి పట్టణానికి చెందిన యశ్వంత్ కుమార్ మూడు గంటల పాటు కష్టపడి పెన్సిల్ నోప్‌పై క్రిస్మస్ ట్రీని చెక్కాడు. ప్రతి ఒక్క పండుగ సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న యశ్వంత్‌ను పలువురు అభినందించారు.



పెన్సిల్‌పై క్రిస్మస్ ట్రీ

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం



ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వ్రతం



వ్రతం చేస్తున్న భక్తులు

నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణంలోని ఎర్రగడ్డ వినోభానగర్ కాలనీలోని సుబ్రహ్మణేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం హనుమత్ వ్రతాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సర్వ వేంకటేశ్వరశర్మ వేదమంత్రాలతో హనుమత్ వ్రతాన్ని కొనసాగించారు. కార్తీక మాసం మొదలుకొని భక్తుల గృహాల్లో భజనలు చేసి సంజీవ ఆంజనేయ స్వామి 41 రోజులు ఆకు పూజలతో కొలిచిన భక్తులు శనివారం రాత్రి అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆదివారం హనుమత్‌వ్రతాన్ని కొనసాగించారు. అర్చకులు శివవరప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం పూర్తిచేశారు. కార్యక్రమానికి ధర్మకర్త భూదాన సుబ్బారావు, కౌన్సిలర్లు మలిశెట్టి పద్మమ్మ, బుచ్చన్న యాదవ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు రామన్‌గౌడ్, కార్యదర్శి లక్ష్మయ్య, సంజీవగౌడ్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో వైభవంగా..

కందనూలు: మార్గశిర శుద్ధ త్రయోదశిని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని ట్యాంక్‌బండ్ రోడ్డులోని శివాంజనేయ స్వామి (హనుమాన్) దేవాలయంలో హనుమాన్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ బృందం అధ్యక్షుడు ఎలిమే ఈశ్వరయ్య మాట్లాడారు. అనంతరం హనుమాన్ భజన మండలి వారిచే 41 రోజుల పాటు కార్తీక భజనలు పూజలు చేశారు. ఈ సందర్భంగా మండలం రోజులపాటు ప్రత్యేక భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులను, కమిటీ సభ్యులను ఘనంగా శాలువాలతో సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో ఆదివారం ఆంజనేయ మాలధారణ స్వాముల ఇరుముడి ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రామాచారి, సుదర్శనాచారి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో ఆంజనేయ మూలమంత్ర హోమం, హన్మాన్ పంచామృత అభిషేకం, అనంతరం గురుస్వామి లింగం ఆధ్వర్యంలో 10 మంది స్వాములకు ఇరుముడి కట్టారు. ఇరుముడిని ఎత్తుకున్న స్వాములు మద్దిమడుగు పబ్బంతి ఆంజనేయస్వామి సన్నిధానానికి తరలివెళ్లారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మద్దిమడుగు తరలిన భక్తులు

వెల్దండ: మండల పరిధిలోని నారాయణపూర్‌తండాలో ఆదివారం ఆంజనేయ స్వాములు ఇరుముడులతో మద్దిమడుగు హన్‌మాన్ దేవాలయానికి తరలివెళ్లారు. దీక్షలు చేపట్టి స్వాములు స్వామివారిని దర్శించుకోడానికి తరలివెళ్లారు. ఇరుముడుల కార్యక్రమంలో భాగంగా స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో హన్‌మాన్ నామస్మరణంతో మారుమ్రోగింది. కార్యక్రమంలో సర్పంచ్ అంజినాయక్, తదితరులు ఉన్నారు.



లింగాలలో ఇరుముడి ఎత్తుకొని మద్దిమడుగు వెళ్తున్న ఆంజనేయ స్వాములు

స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టులు భర్తీ చేయాలని వినతి



కోదండరాంకు వినతి అందజేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

అచ్చంపేట రూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు నాణ్యమైన విద్య, బోధన అందించడానికి ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 97 ద్వారా 1523 స్పెషల్ టీచర్ పోస్టులను, నియామక ప్రక్రియ చేస్తామని ప్రకటించిందని, నోటిఫికేషన్ ఇవ్వలేదని స్పెషల్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ చలమల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల విద్య కోసం(1523) నోటిఫికేషన్ కోసం వేలాది మంది నిరుద్యోగ స్పెషల్ టీచర్ అభ్యర్థులు వేచి చూస్తున్నారన్నారు. తప్పకుండా ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి నోటిఫికేషన్ వచ్చేలా చూస్తామని కోదండరాం చెప్పారని శ్రీనివాస్‌గౌడ్ తెలియజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రసిడెంట్ శివకుమార్, శ్రీనివాస్, యాదగిరి రెడ్డి, ప్రశాంత్ గౌడ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుపై రైతుల ఆసక్తి

పెద్దకొత్తపల్లి: మండలంలో వాణిజ్య పంట అయిన డ్రాగన్ ఫ్రూట్ పంటపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మండలంలోని కల్వకోలు, చెన్నపురావుపల్లి గ్రామాల్లో రైతు కొత్త వెంకట్‌రెడ్డి ఈ పంటను సాగు చేస్తున్నాడు. ఎకరాకు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతున్నట్లు తెలిపారు. మొక్కలతో పాటు సిమెంట్ స్తంభాలు, డ్రిప్, సిమెంట్ చక్రాలను ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు ఎకరాకు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుంది. మార్కెట్‌లో ఈ పంటకు డిమాండ్ ఉండటంతో డ్రాగన్ ఫ్రూట్‌సాగు కోసం రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలను అందజేస్తే సాగు చేస్తామంటున్నారు. ప్రభుత్వం పట్టించుకుని సబ్సిడీని ప్రకటించాలని రైతులు రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి కోరారు.



కల్వకోలులో డ్రాగన్ ఫ్రూట్ సాగు